సాక్షి పశ్చిమగోదావరి

గురువారం । 4 । జనవరి । 2024



పంచారామంలో కేంద్ర మంత్రి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం సోమేశ్వర జనార్దన స్వామిని బుధవారం కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ శాఖ మంత్రి పర్షోత్తమ్ రూపాలా దర్శించుకున్నారు.



రూ.18.88 లక్షల ఆదాయం

పెదవేగి: శ్రీ రాట్నాలమ్మ హుండీని భక్తుల సమక్షంలో దేవస్థాన సిబ్బంది లెక్కించారు. 125 రోజులకు రూ.18,88,879 ఆదాయం లభించింది.

పారిజాతగిరిలో ధనుర్మాస ఉత్సవాలు



జంగారెడ్డిగూడెం: పారిజాత గిరి ఆలయంలో ధనుర్మాస ఉత్సవంలో 18వ రోజు గోదాదేవికి, పద్మావతి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

రీ సర్వే ఆదర్శంగా నిలవాలి



తాడేపల్లిగూడెం అర్బన్ రీ సర్వేపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): దేశంలోనే పైలట్ ప్రాజెక్టుగా తాడేపల్లిగూడెం అర్బన్ రీ సర్వే ఆదర్శంగా నిలవాలని, పొరపాట్లకు తావులేకుండా సంక్రాంతిలోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రీ సర్వేపై ఆర్డీవో కె చెన్నయ్య, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే పైలట్ ప్రాజెక్టు కింద తాడేపల్లిగూడెం అర్బన్ రీ సర్వే ఆదర్శంగా నిలవాలని, పట్టణ రీ సర్వే సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ భూమి, ప్రైవేటు భూమి, అక్రమణలు, భూ విస్తీర్ణాలపై పట్టణ మ్యాపులను పరిశీలించి, వార్డుల వారీగా సమీక్షించారు. రైతులు, గృహ యజమానులకు అభ్యంతరాలు ఉంటే వినతులు స్వీకరించి, వాటిపై విచారణ చేసి సంక్రాంతిలోగా నివృత్తి చేయాలని మున్సిపల్ కమిషనరును ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె జాషువా, కమిషనరు డా.ఏ శామ్యూల్, తహశీల్దారు ఎస్.శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీగా భీమారావు



ఎస్పీ రవిప్రకాష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) భీమారావు

భీమవరం: జిల్లా నూతన అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా వి.భీమారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ యు.రవిప్రకాష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన శ్రీకాళహస్తి ఎస్డీపీఓగా ఉద్యోగ నిర్వహణ చేస్తూ ప్రమోషన్‌పై జిల్లాకు వచ్చారు. బదిలీపై వెళుతున్న అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏవీ సుబ్బరాజుతో జిల్లాలో లా అండ్ ఆర్డర్ తదితర బాధ్యతల గురించి చర్చించారు.

ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు సమర్పించాల్సిన లైఫ్ సర్టిఫికెట్ నమోదు ప్రక్రియ జనవరి 1 నుంచి ప్రారంభమైందని భీమవరం ఉపఖజానా అధికారి రవివర్మ తెలిపారు. పెన్షనర్లు ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికెట్లను డిజిటల్ రూపంలో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

6న మహిళా మార్ట్ ప్రారంభం

నూజివీడు: నూజివీడు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌ను ఈనెల 6న ప్రారంభిస్తున్నందున మహిళా సమాఖ్య పాలకవర్గ సభ్యులు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి ఆహ్వానించారు. వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికను కలెక్టర్‌కు అందజేశారు. మండలంలోని 62 గ్రామైఖ్య సంఘాల్లోని 18,643 సభ్యులు ఒక్కొక్కరు రూ.200 వాటా ధనంతో రూ.36 లక్షల పెట్టుబడితో వైఎస్ఆర్ చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

ఏలూరు(మెట్రో): అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 9 లోగా తెలియజేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ శాఖలో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి 12 టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులను నియమించుకునేందుకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ జాబితాకు సంబంధించి అభ్యంతరాలను ఈ నెల 9 లోపు స్వయంగా ఏలూరు కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారికి పూర్తి వివరాలతో అందజేయాలన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

ఏలూరు(మెట్రో): రెండో విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం 1597 మంది వైద్య సేవలు పొందారని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరులో 433, జంగారెడ్డిగూడెంలో 273, నూజివీడులో 370, చింతలపూడిలో 521 ఓపీ కేసులు నమోదయ్యాయన్నారు. ఇందులో 709 మంది పురుషులు కాగా, 888 మంది మహిళలు ఉన్నారన్నారు. గతంలో పొందిన వైద్య సేవలకు అనుసంధాన వైద్య సేవలు లక్ష్యంగా నిర్దేశించామన్నారు.

రబీ పనులు వేగవంతం

- జిల్లాలోని 2.38 లక్షల ఎకరాల్లో సాగు
- 1.33 లక్షల ఎకరాలకు సిద్ధంగా నారుమడులు
- 6,500 ఎకరాల్లో పూర్తయిన నాట్లు
- రెండు వారాలు ఆలస్యంగా మొదలైన నాట్లు
- చివరిలో నీటి ఎద్దడి రాకుండా వ్యవసాయశాఖ కసరత్తు



పోడూరులో నాట్లు వేసేందుకు సిద్ధమైన పొలాలు



తాడేపల్లిగూడెంలో నాట్లు వేస్తున్న కూలీలు

సాక్షి, భీమవరం: జిల్లాలో రబీ పనులు ముమ్మరమవుతున్నాయి. 55 శాతం విస్తీర్ణానికి నారుమడులు సిద్ధం కాగా 6,500 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. తొలకరిలో వచ్చిన మిచాంగ్ తుపానుతో దాళ్వా జాప్యం కాగా చివరిలో సాగునీటి ఎద్దడి రాకుండా పనులు వేగవంతం చేసే పనిలో వ్యవసాయశాఖ నిమగ్నమైంది. మెరక భూముల్లో రైతులు వెదజల్లే సాగు చేపట్టేలా కృషిచేస్తోంది. జిల్లాలోని డెల్టా, మెట్ట, ఏజెన్సీ పరిధిలోని 2.38 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరగనుంది. జనవరి నాటికి అధికశాతం విస్తీర్ణంలో నాట్లు పూర్తికావాల్సి ఉంది. తొలకరి సాగు చివరిలో మిచాంగ్ తుపాను ప్రభావంతో పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. రోజుల తరబడి పొలాలు నీట మునిగి ఉండటంతో వరికోతలు ఆలస్యమయ్యాయి. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇంకా ఐదు శాతం విస్తీర్ణంలో మాసూళ్లు పూర్తి కావాల్సి ఉన్నట్టు అంచనా. ముందుగా కోతలు పూర్తయిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఆచంట, పోడూరు, గణపవరం, పాలకొల్లు మండలాల్లో ఇప్పటికే నాట్లు మొదలైంది. మిగిలిన ప్రాంతాల్లోను పనులు జోరందుకుంటున్నాయి. 1.33 లక్షల ఎకరాలకు నారుమడులు సిద్ధం కాగా 6,500 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి.

సాగు వేగవంతం : అధిక శాతం విస్తీర్ణంలో దాళ్వా రెండు వారాలుపైగా ఆలస్యంగా మొదలుకావడంతో మే మొదటి వారం వరకు సాగు జరగనుంది. ఎండల తీవ్రతతో సాగు చివరిలో సాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండటంతో సమస్యను అధిగమించేందుకు జిల్లా వ్యవసాయ యంత్రాంగం కృషిచేస్తోంది. మిగిలిన విస్తీర్ణంలో పనులు వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. సాగు ప్రారంభానికి ముందే 888 క్వింటాళ్ల విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేసింది. 44.395 మెట్రిక్ టన్నుల డీఏపీ, యూరియా, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పీ, ఎంఓపీ ఎరువులను ఆర్‌బీకేలు, మార్క్‌ఫెడ్, హోల్‌సేల్, ప్రైవేట్ డీలర్లు, సొసైటీల వద్ద అందుబాటులో ఉంచింది.

వెదజల్లే సాగుతో మేలు : పశ్చిమ డెల్టాలో సాధారణంగా 95 శాతం విస్తీర్ణంలో నాట్లు వేస్తే కేవలం ఐదు శాతం విస్తీర్ణంలో మాత్రమే వెదజల్లు సాగు చేస్తారు. ఈ సీజన్‌లో చాలావరకు సాగుచేసే 1121 వంగడం పంటకాలం 110 రోజులు. నాట్లు వేయడంతో పోలిస్తే వెదజల్లు సాగులో వారం రోజుల ముందే పంట కోతకు వస్తుంది. ఇంకా నారుమడులు సిద్ధం చేసుకోని మెరక భూముల రైతులు వెదజల్లు సాగుచేపట్టేలా వ్యవసాయ సిబ్బంది చైతన్యపరుస్తున్నారు. వారం రోజులు సాగుకాలం తగ్గడం వలన చివరిలో నీటి ఎద్దడిని అధిగమించడంతో పాటు ఎకరాకు రూ.3500 వరకు పెట్టుబడి ఆదా చేసుకోవచ్చని సూచిస్తున్నారు.

పూర్తికావస్తున్న ధాన్యం కొనుగోళ్లు

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావస్తున్నాయి. 4.21 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రాథమిక అంచనా కాగా ఇప్పటికే 261 ఆర్‌బీకేల ద్వారా 3.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తయ్యింది. ధాన్యం కొనుగోలు చేసిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తున్నారు. త్వరితగతిన మిగిలిన ధాన్యం సేకరణ చేసేందుకు సివిల్ సప్లయిస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సాగు వేగవంతం చేయిస్తున్నాం



జిల్లాలో 1.33 లక్షల ఎకరాల్లో నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధమయ్యాయి. మిచాంగ్ తుపాను ప్రభావంతో దాళ్వా సాగు ఆలస్యమైంది. చివరిలో నీటి ఎద్దడి తలెత్తకుండా రైతులతో మాట్లాడి పనులు వేగవంతం చేయిస్తున్నాం. మెరక భూముల్లో వెదజల్లు పద్ధతి చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

– జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జేడీ, పశ్చిమగోదావరి జిల్లా

కాళికాంబ మృతి తీరనిలోటు



కాళికాంబ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: మాజీ ఎమ్మెల్యే పరకాల కాళికాంబ మృతి తీరని లోటని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కాళికాంబ మృతికి బుధవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ పరకాల శేషావతారం మర్రి చెన్నారెడ్డి, నీలం సంజీవరెడ్డి మంత్రి వర్గాల్లో కీలక శాఖలు నిర్వహించారని గుర్తు చేశారు. భర్తకు అండగా ఉన్న కాళికాంబ తరువాత భర్త మృతితో రాజకీయల్లోకి అడుగుపెట్టి విజయపరంపర కొనసాగించారని చెప్పారు. పరకాల కుటుంబం నరసాపురం అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. సీనియర్ నేత, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు మాట్లాడుతూ శేషావతారం, కాళికాంబలతో కలిసి పనిచేసిన రోజులు గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాబ్జి, పార్టీ సీనియర్ నేతలు అందే భుజంగరావు, కామన బుజ్జి, షేక్ బులిమస్తాన్, అయితం ధనలక్ష్మి, బర్రి శంకరం, పప్పుల రామారావు తదితరులు పాల్గొన్నారు. తెలగా కళ్యాణమండపంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు ఆధ్వర్యంలో కాలికాంబ మృతికి సంతాప సభ నిర్వహించారు.

ఆరోగ్యశ్రీలో రూ. 25 లక్షల వైద్య సేవలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్యానికి రక్షణ అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక వీకర్స్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో ఆరోగ్యశ్రీలో రూ. 5 లక్షల వైద్యం అందించేవారని, ఇప్పుడు ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డులు అందించి వాటి ద్వారా రూ. 25 లక్షల వరకు అవసరమయ్యే వైద్య సేవలను ఉచితంగా ఆరోగ్యశ్రీపరిధిలో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో అందజేస్తున్నారన్నారు. దానికి తగినట్టుగానే పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులను ప్రతీ నెలా ఉచితంగా అందచేస్తున్నామన్నారు. ఆరోగ్య సురక్ష ప్రతి బుధవారం ఒక్కో వార్డులో నిర్వహిస్తారన్నారు. దీనిని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. వైద్యచికిత్స అవసరమైన వారు ముందుగా తమ వార్డు వలంటీర్ల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకానికి ఆయన తనయుడు జగన్‌మోహనరెడ్డి మరింత వన్నె తెచ్చారన్నారు. 108 వాహనాలను వైఎస్సార్ ప్రవేశపెడితే తెదేపా ప్రభుత్వంలో కనీసం పెట్రోలు బకాయిలు కూడా చెల్లించకుండా 108 వాహనాలను నిర్వీర్యం చేశారన్నారు. ఆరోగ్య శ్రీ కార్డులను 1, 2 వార్డుల ప్రజలకు మంత్రి కొట్టు చేతుల మీదుగా అందచేశారు. ఆర్‌డీఓ, ప్రత్యేక అధికారి చెన్నయ్య మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేలా ప్రతి వాలంటీరు, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎం, వైద్యులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. వైద్యుడు రవికుమార్ ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అందచేస్తున్న సేవల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో మునిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి సామ్యూల్, నాయకులు శీలి మేరీకుమారి, బోళం రామలక్ష్మి, పత్మట్ల సావిత్రి, గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, కర్నాటి కన్నయ్య, కోడే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ స్వరూపిణి సావిత్రిబాయి పూలే

జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు (టూటౌన్): కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి సావిత్రి బాయి పూలే అని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కొనియాడారు. స్థానిక జెడ్పీ సెంటరులోని పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి ప్రాణాలను సైతం లెక్కపెట్టకుండా సమష్టిగా పోరాటం చేసిన మహనీయురాలని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటీ సీఈఓ ఎస్.నిర్మలాజ్యోతి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి ఆదర్శనీయురాలు

భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక వేత్త సావిత్రి బాయి పూలే నేటి మహిళా లోకానికి ఆదర్శనీయురాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం సావిత్రి బాయి జయంతి కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా సావిత్రి బాయి పూలే చిత్రపటానికి ఎమ్మెల్యే ఆళ్ల నాని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్త్రీల హక్కులు, బాల్యవివాహాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడంతో పాటు స్త్రీ విద్యకు కంకణం కట్టుకున్న మహనీయురాలని గుర్తు చేశారు.

పాడి పశువుల్లో వ్యాధులపై అవగాహన



సిబ్బందికి శిక్షణ అందిస్తున్న మహిళా శిక్షకురాలు

పెంటపాడు: పాడిరైతుల సంక్షేమం, పశు సంవర్ధక శాఖ అభివృద్ధి లక్ష్యంగా సిబ్బంది లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. పెంటపాడులోని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో డీడీ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో పారావెట్ సిబ్బందికి, ఆర్బీకే స్టాఫ్‌కు సమీక్ష, శిక్షణ సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న మురళీకృష్ణ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గాలికుంటు వ్యాధులకు టీకాల లక్ష్యాలను పూర్తిచేస్తూ, ప్రభుత్వం పాడిరైతులకు అందిస్తున్న పథకాలపై వివరించాలన్నారు. పశు ఆధార్ కార్డులు ప్రతి రైతుకు అందించాలన్నారు. గొర్రెలు, మేకలలో వచ్చే సాధారణ వ్యాధులతో పాటు, నాలుకపై వచ్చే నీలిరంగు వ్యాధిపై శిక్షకురాలు అందించిన సబ్జెక్ట్‌పై డాక్టర్ల సందేహాలను నివృత్తి చేసుకున్నారు. డిప్యూటీ డైరెక్టర్ కెఎల్ సుధాకర్ మాట్లాడుతూ వెటర్నరీ సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పశువైద్యాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

8న అప్రెంటీస్ మేళా

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ కోర్సులు పూర్తి చేసిన వారంతా ఈ అప్రెంటీస్ మేళాకు నేరుగా ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావచ్చన్నారు. ఇతర వివరాలకు 88863 39666 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడపాలి



డైరీ ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్యామ్ సుందర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు విద్యార్థులను ఉన్నత లక్ష్యాలవైపు నడిపించాలని, వారికి తగిన దిశానిర్దేశం చేసి వారు సత్ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ సూచించారు. వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర డైరీలు, టేబుల్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి వినూత్నమైన పథకాలను అందిస్తుందన్నారు. వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న కృషి కారణంగా రాష్ట్రం ప్రభుత్వ విద్యారంగంలో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోతోందన్నారు. వైఎస్ఆర్ టీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ జీజేఏ స్టీవెన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పగడాల సాంబశివరావు, బీ. రామ్మోహనరావు, తోట ఎడ్వర్డ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారుల మోములో ఆనందం



అత్తిలిలో లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తున్న పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



భీమవరంలో చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న

అత్తిలి: అవ్వా తాతల మదిలో ఆనందాన్ని నింపేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ మొత్తాన్ని పెంచారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం అత్తిలి శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపం వద్ద రూ.3 వేల పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో పేదలు, వృద్ధులు, వితంతువుల కష్టాలు నేరుగా చూసి పింఛనును రూ. 3 వేలకు వరకు పెంచుతానని ఇచ్చిన హామీని నూతన సంవత్సర కానుకగా అందచేశారని అన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు. ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పాలన చూసి దేశ వ్యాప్తంగా రాష్ట్రాలన్నీ ఏపీ వైపే చూసే పరిస్థితి కలిగిందన్నారు. మనకు ఏ ప్రభుత్వ సమయంలో మంచి జరిగిందో, ఏ ప్రభుత్వం సాయం చేస్తుందో కూడా ప్రజలు గమనించాలని సూచించారు. గత చంద్రబాబు ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య పరిపాలనలో తేడా గమనించాలని జగనన్న ప్రభుత్వం పేదలకు సాయం చేసే ప్రభుత్వమని స్పష్టం చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పేదలకు చెందాల్సిన డబ్బును దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. ప్రజలను మోసం చేయడానికి టీడీపీ, జనసేన రెండు జెండాలతో వస్తున్నారని, వారి చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మేడిద జాన్సన్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా భరోసా.. పింఛన్లు

భీమవరం(ప్రకాశం చౌక్): వైఎస్సార్ పెన్షన్ కానుక రూ.3 వేలు పెంపు కార్యక్రమంలో భాగంగా బుధవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనగా జిల్లాస్థాయి కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెంద్ర వీరన్న పెన్షన్ లబ్ధిదారులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక భద్రతకు అందచేస్తున్న వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారులకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందన్నారు. పెంచిన పెన్షన్ లబ్ధిదారులకు మరింత ప్రయోజనంగా ఉంటుందన్నారు. జిల్లాల్లో నేటి వరకు అర్హులైన 25 రకాల పింఛన్ లబ్ధిదారులు 2,38,321 మందికి రూ.69.97 కోట్లు అందజేస్తున్నామన్నారు. జనవరి ఒకటి నుంచి 8 రకాల పింఛన్‌దారులు 1,96,624 మంది ఉండగా రూ.3 వేలను పెంచడం ద్వారా రూ.4.92 కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా మంజూరైన 4,274 మందికి రూ.1.28 కోట్లు మొత్తం అందిస్తున్నామన్నారు. జిల్లాలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఈ నెల 2 నుంచి 5 వరకు ఆయా మండలాలు, మున్సిపాల్టీల్లో నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా ఆచంట 30,415 మందికి రూ.8,80,74,000, భీమవరం 32,078 మందికి రూ.9,50,37,500, నరసాపురం 28,185 మందికి రూ.8,28,55,000, పాలకొల్లు 30,533 మందికి రూ.8,94,32,000, తాడేపల్లిగూడెం 32,581 మందికి 9,65,16,000, తణుకు 37493 మందికి రూ. 10,99,85,500, ఉండి 36,562 మందికి రూ. 10,68,43,500, గణపవరం మండలం 9,081 మందికి రూ.2,67,91,500 కలిపి మొత్తం 2,36,928 మందికి రూ.69,55,35,000 ఖర్చు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శివప్రసాద్‌యాదవ్, జిల్లా గ్రామ వార్డు సచివాలయాలు అధికారి కేసీహెచ్ అప్పారావు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు డీఎన్నార్ ఎన్‌సీసీ క్యాడెట్

భీమవరం : ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలకు డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ ఎం.పవన్ సాయి విఘ్నేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి బుధవారం చెప్పారు. ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య మాట్లాడుతూ విఘ్నేష్ కవాతు విభాగంలో ఎంపికై రాజ్‌పథ్‌లో మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొనడమే గాక, పీఎం ర్యాలీ తదితర విభాగాల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు.

ప్రజాదీవెన యాత్రకు జననీరాజనం

2వ రోజు అత్తిలిలో కొనసాగిన మంత్రి కారుమూరి పాదయాత్ర

అత్తిలి : అవినీతికి తావులేకుండా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలు విశేష ఆదరాభిమానాలు చూపిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర రావు చెప్పారు. మంత్రి చేపట్టిన ప్రజాదీవెన పాదయాత్ర రెండో రోజు బుధవారం అత్తిలి పెదపేట నుంచి సంతమార్కెట్ సెంటర్, గణేష్ చౌక్, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, పడవలరేవు, గోగులమ్మపేట, రామన్నపేట వరకు సాగింది. అడుగడుగునా మహిళలు మంత్రి కారుమూరికి హారతులిచ్చి, ఘనస్వాగతం పలికారు. వృద్ధులు, వికలాంగులు, చిన్నారులను మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ పాదయాత్ర కొనసాగించారు. తామంతా మీవెంటే ఉంటామని, తిరిగి జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మహిళలు మంత్రికి ముక్తకంఠంతో తెలిపారు. స్థానిక సమస్యలపై మహిళలు,ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురావడంతో వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధితశాఖ అధికారులను మంత్రి కారుమూరి ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మంత్రి కారుమూరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నారన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి, 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలను అందించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా గడపవద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని, లేకపోతే మరలా ప్రజాధనాన్ని దోచుకునే పాలకులు వస్తారన్నారు. తాను చేపట్టిన ప్రజాదీవెన పాదయాత్రలో ప్రజలందరూ కలిసికట్టుగా తనతో నడుస్తున్నారని, ప్రతి గడపలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి చెప్పారు. మంత్రి వెంట పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అత్తిలిలో పాదయాత్రలో మహిళల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఉపాధి పథకాలతో ఆర్థిక స్వావలంబన సాధించాలి

- కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల పిలుపు
- దిగమర్రులో ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్ ప్రారంభం

పాలకొల్లు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలను యువత సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని కేంద్ర మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి పర్షోత్తం రూపాల పిలుపునిచ్చారు. పాలకొల్లు మండలం దిగమర్రు (కొత్తపేట) బైపాస్ రోడ్డు సెంటర్‌లో సాగర్ పరిక్రమ్‌లో భాగంగా రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్‌ను బుధవారం కేంద్ర మంత్రి ప్రారంభించి మాట్లాడారు. యువత పరిశ్రమల స్థాపన వైపు అడుగులు వేయాలని, ఫిష్ రెస్టారెంట్లు, ఫిష్ స్టాల్స్ తదితర ఉపాధి మార్గాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. యువత ఆర్థికంగా స్థిరపడి దేశ అభివృద్ధి, భద్రతపై ఆలోచన చేయాలన్నారు. రైతుల మాదిరిగానే మత్స్యకారులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సాగర్ పరిక్రమ్ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. పీఎంఎస్‌వై పథకాలను ప్రచారం చేస్తున్నామన్నారు. ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసిన నిరుద్యోగి కట్టా సౌమిత్‌బాబు మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ పి ప్రశాంతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, గ్రామ సర్పంచ్ కవురు భారతి, ఎంపీటీసీ సభ్యులు పెదపాటి వెంకటరత్నం, ఆర్డీవో ఎం అచ్యుతాంబరీష్, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, మత్స్యశాఖ ఏడీ ఏడుకొండలు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీవో ఎల్ఎల్ఎన్ రాజు, యర్రంశెట్టి పద్మారావు, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.



దిగమర్రులో ఫిష్ ఆంధ్ర రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల

ఏసీ మెకానిక్ ఆత్మహత్య



క్రాంతికుమార్ మృతదేహం

నిడమర్రు: కుటుంబంలో గొడవలతో మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఓ ఏసీ మెకానిక్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన అయితం క్రాంతి కుమార్ (28) నిడమర్రు మండలం తోకలపల్లికి చెందిన గంగారత్నంతో 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా క్రాంతికుమార్ చెడు అలవాట్లకు బానిసై భార్యను కొడుతుండటంతో పెద్దల్లో మధ్య రాజీ చేసినా అతనిలో మార్పు రాలేదు. దీంతో భార్య గత నెల 29న పుట్టింటికి వెళ్లి నిడమర్రు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మంగళవారం పిల్లలను చూసేందుకు నిడమర్రు వచ్చిన క్రాంతికుమార్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అతనిని 108లో తాడేపల్లిగూడెం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ఆర్ శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



శ్రీనివాస్ మృతదేహం

తణుకు : మోటార్ సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన ముంగర శ్రీనివాస్ (36) భార్య పురుడు కోసం పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం మండపాక గ్రామంలోని పుట్టింటికి వచ్చింది. దీంతో శ్రీనివాస్ బుధవారం భార్య, పిల్లలను చూసేందుకు మండపాక వచ్చాడు. సాయంత్రం స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై తిరిగి బయలుదేరాడు. గ్రామం శివారులోకి వచ్చేసరికి ట్రాక్టర్ వెనుక నుంచి వేగంగా వచ్చి ఇతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై శ్రీనివాస్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తణుకు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



తణుకులో డిగ్రీ విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తణుకు టౌన్: తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి దొమ్మేటి జోహారికకు తన కళాశాల ఫీజుల నిమిత్తం రూ. 10 వేల ఆర్థిక సహాయం బుధవారం అందజేసినట్లు మానవత సంస్థ అధ్యక్షుడు అక్కాపంతుల బాలాజీ తెలిపారు. ఈకార్యక్రమంలో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, కార్యదర్శి ఆలపాటి సోమేశ్వరరావు, కోశాధికారి అక్కిన కాశీ, ఎస్వీ రమణమూర్తి, ఆకెళ్ల, పి శివన్నారాయణ, మల్లిపూడి లక్ష్మీ, బీ రామకాశీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతల ఊరేగింపు



అలంపురంలో అయోధ్య అక్షింతలు ఊరేగిస్తున్న మహిళలు

పెంటపాడు: రామజన్మభూమి తీర్థయాత్ర ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం అలంపురం గ్రామంలో అయోధ్య రాముని అక్షింతలు ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు ఇంటింటికి వెళ్లి స్వామివారి అక్షింతలు, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

ఆరుగొలనులో కైలాసనాథుని విగ్రహావిష్కరణ



ఆరుగొలను గ్రామంలో కైలాసనాథుని విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గ్రామంలోని రుద్రభూమిలో నూతనంగా ఏర్పాటు చేసిన కైలాసనాథుని విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. శాంతివనం అభివృద్ధిలో భాగంగా స్వర్గీయ నూకల సత్యనారాయణ – భద్రమ్మ జ్ఞాపకార్థం ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్లు ఆరుగొలను సొసైటీ మాజీ చైర్మన్ నూకల బుల్లియ్య తెలిపారు. ఎన్‌డీకే సోదరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణటీకాలను ప్రతి రైతు వేయించాలని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడారు. అనంతరం 103 పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

తణుకు: అత్తిలి పట్టణానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు చేసినట్లు తణుకు పట్టణ పోలీసులు తెలిపారు. అత్తిలికి చెందిన దాసం వీరవేణి ఈనెల 2న అత్తిలి నుంచి బయలదేరి తణుకు బయల్దేరి వచ్చారు. అయితే తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో ఆచూకీ కోసం గాలించారు. ఆమె ఆచూకీ లభ్యం కాకపోవడంతో భర్త సూర్యచంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విచ్చలవిడిగా చెత్త వేయవద్దు

తాడేపల్లిగూడెం: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్నందున పట్టణ ప్రజలు విచ్చలవిడిగా బయట చెత్తవేయవద్దని మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ కోరారు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు విచ్చలవిడిగా, బహిరంగంగా మురుగు కాలువలలోను, రోడ్లపైన వేయవద్దన్నారు. మీ ఇంటి వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. పరిసర ప్రాంతాలను అశుభ్రపర్చకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నేడు కొమ్మర, ఈడూరులో ప్రజా దీవెన పాదయాత్ర

అత్తిలి: గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం ఉదయం కొమ్మర, మధ్యాహ్నం ఈడూరు గ్రామాల్లో ప్రజాదీవెన పాదయాత్రలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. అనంతరం రాత్రి కంచుమర్రు గ్రామంలో మంత్రి బస చేస్తారని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అత్తిలిలో మంత్రి కారుమూరికి హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

అత్తిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని రాష్ట్రపౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం అత్తిలిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చేపట్టిన ప్రజా దీవెన పాదయాత్రలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బ్రోచర్‌లను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు బటన్‌నొక్కి మీఖాతాకే జమ చేస్తున్నారని, ఇటువంటి సంక్షేమ పాలన కొనసాగాలంటే తిరిగి మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. పుట్టబోయే బిడ్డనుంచి పండు ముసలివరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రతి కుటుంబానికి కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందజేసి, వారికి ఉచితంగా మందులను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్‌మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేతనాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రంభ సూరిబాబు, కోరుకొల్లు వెంకట్రావు, పోలినాటి చంద్రరావు, గారపాటి నాగరాజు, తమ్మాబత్తుల రాము, బుడితి సుజన్‌కుమార్, ఆకుల చినబాబు, సబ్బితి రాజేష్, రామిశెట్టి రాము, గంటా నాగరాజు, ప్రవీణ్‌రాయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆశీర్వాద పాదయాత్రకు నీరాజనం

అత్తిలి: ప్రతి ఒక్కరి అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి వల్లే సాధ్యపడుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. అత్తిలిలో బుధవారం రెండో రోజు కొనసాగిన ప్రజాదీవెన పాదయాత్రలో మంత్రి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన చేస్తున్నారన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి, 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలను అందించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి వలంటీర్ల ద్వారా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమపాలన కొనసాగుతుందన్నారు. తాను చేపట్టిన ప్రజాదీవెన పాదయాత్రలో ప్రజలందరూ కలిసికట్టుగా నాతో నడుస్తున్నారని, ప్రతీ గడపగడపకు ప్రజా స్పందన లభిస్తుందన్నారు. ఏ గడపకు వెళ్లినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిందని చెబుతున్నారన్నారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, తణుకు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- రూ.3వేలకు పెంచిన, కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ



అత్తిలిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి ఆదుకుంటోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పెంచిన పింఛన్ సొమ్ము రూ.3వేలు, కొత్తగా మంజూరైన పింఛన్‌దారులకు వైఎస్సార్ పింఛన్ కానుకలను మంత్రి అందజేశారు. బుధవారం అత్తిలిలో వల్లీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఆశీర్వదించాలని, ఎమ్మెల్యేగా తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకొని పింఛన్ కానుక ద్వారా అవ్వ, తాతలకు అండగా నిలిచారన్నారు.ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛనుదారులను ఉద్దేశించి రాసిన లేఖను పంచాయతీ కార్యదర్శి సుజాత చదివి వినిపించారు. సావిత్రిబాయి పూలే సందర్భంగా ఆమె చిత్రపటానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మేడిద జాన్సన్, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు కూనపరెడ్డి జయరాజు, కందుల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, సొసైటీ అధ్యక్షుడు వట్టికూటి సూర్యనారాయణ, కునాధరాజు శ్రీహరిరాజు, తణుకు మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీడీఓ అమీలుజమా, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

‘గూడెం’ మండల అభివృద్ధికి కృషి

ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: గూడెం మండల అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేయడం జరుగుతుందని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పానుకుమాటి శేషులత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పనిచేసి, మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. పశుసంవర్ధక శాఖ అంశంపై పశువైద్యాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతుండగా ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ కలుగజేసుకుని మార్కెట్ కమిటి తరపున పశువుల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించి శిబిరాల ఏర్పాటుకు అన్ని విధాల సహకరిస్తామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ అంశంపై టెక్నికల్ అసిస్టెంట్ జె.థామస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో గత ఐదేళ్ల కాలంలో రూ.72 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. రానున్న మూడు నెలల కాలంలో 70వేల పనిదినాలు కల్పించవలసి ఉందన్నారు. ఐసీడీఎస్ అంశంపై వెలుగు ఏపీఎం జీవీకేడిఎం. లక్ష్మి ఈ నెల 21 నుంచి 30వ తేది వరకు వైఎస్సార్ ఆసరాపై మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యాశాఖ అంశంపై ఎంఈవో వి.హనుమ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఏర్పాటు చేశామన్నారు. గతంలో పలువురు విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశామని, 1455 ట్యాబ్‌లు రావాల్సి ఉందన్నారు. వంద రోజుల కార్యాచరణ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వ్యవసాయ శాఖ అంశంపై ఏవో ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 14,992 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయన్నారు.వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ మాట్లాడుతూ వైట్ పొటాష్‌ను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచాలన్నారు. రెవెన్యూ శాఖ అంశంపై డీటీ అనూరాధ మాట్లాడుతూ 395 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని, త్వరలోనే అందజేస్తామన్నారు. అనంతరం వివిధశాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. తొలుత సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఎంఈవో వి.హనుమ, పీఆర్ డీఈ వి.వేణుగోపాల్, హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీసరస్వతి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు) వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీజీఎఫ్ నిధులు మంజూరుకు కృషి చేస్తా

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



కుంచనపల్లిలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: శ్రీదేవీ, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ నిర్మాణానికి రూ.50లక్షలు సీజీఎఫ్ నిధులు మంజూరుకు కృషి చేస్తానని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నామకరణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే ఆలయ నిర్మాణం సగం పూర్తయిందని, దీనిని పూర్తి చేయడానికి మరో రూ.50లక్షలు అవసరం అవుతుందన్నారు. ఆలయాన్ని సకాలంలో పూర్తి చేయడానికి అన్ని చర్యలు తాను తీసుకుంటానన్నారు. ఆయన వెంట సీజీఎఫ్ కమిటి సభ్యుడు కర్రి భాస్కరరావు, విజయవాడ కనకదుర్గమ్మ వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్దనరావు, మాజీ కౌన్సిలర్ పైబోయిన వైదేహి, ఆలయ నిర్మాణ కమిటి చైర్మన్ ఆత్కూరి వీరవెంకట పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యతోనే మహిళలకు సముచిత స్థానం



తణుకులో పూలే విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, తదితరులు

తణుకు అర్బన్: మహిళలకు సముచిత స్థానం విద్యతోనే సాధ్యమని సావిత్రాబాయి పూలే ఉద్యమించారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకులో మహాత్మా సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి మహనీయులను స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, సుద్దుల పాండు, గుబ్బల సూర్యచంద్రరావు, పిల్లి సూరిబాబు, సామంతుల అప్పారావు, కుడుపూడి చంద్రరావు, తాటిపర్తి వాసు, జిలాని, సంగిరెడ్డి శ్రీనివాస్, ఎస్వీ జాకబ్‌బాబు, డోలా సింహాద్రి, అభిషేక్, జెస్‌పాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు. తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా సావిత్రిబాయి పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే

పెంటపాడు: ఆధునిక భారత తొలి ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి, రచయిత, సామాజిక ఉద్యమ నాయకురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతి కార్యక్రమం పెంటపాడు పోస్టుబేసిక్ స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు టీవీ రామకృష్ణ, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం దివ్యాంగుల విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, కే.కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.

భారత మహిళలకు పండుగరోజు

తణుకు టౌన్: పట్టణంలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు తదితరులు సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్యం



తణుకులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా తణుకు 1వ వార్డులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం చేస్తున్నారనే ఉద్దేశ్యంతో సీఎం జగన్ రెండోసారి మళ్లీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఏ జబ్బును అయినా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించుకోవడం సులువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, వార్డు ఇన్‌చార్జ్‌లు పైబోయిన ఏసుబాబు, ఎస్వీ జాకబ్ బాబు, ఆర్తమూరి మణికంఠరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పుల్లెపు సూర్యచంద్రరావు, జిలానీ, చింతన్న, వైద్యులు డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు, మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా ‘కామిశెట్టి’

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా తాడేపల్లిగూడెం మండలం పడాల గ్రామానికి చెందిన కామిశెట్టి కృష్ణవినోద్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కార్యదర్శులుగా ఎస్‌కే.వలీ బాషా (తాడేపల్లిగూడెం), దారపురెడ్డి శ్రీనివాస్ (కడియద్ద)లను నియమించారు. వీరి నియామకం పట్ల జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్ యాతం కోటేశ్వరి, మండల సేవాదళ్ అధ్యక్షుడు కొండుబోయిన కృపావరం, పాకనాటి తాతాజీ, ఎమ్పీటీసీలు, సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం



అత్తిలిలో వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి అత్తిలి రామన్న పేటలో రూ. 23 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్, రూ. 24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటావిజేత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.